క్లుప్తంగా

నిబద్ధతతో పనిచేస్తే మంచి ఫలితాలు



సమావేశంలో మాట్లాడుతున్న రుడా వైస్ చైర్మన్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధిలో భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులను నిర్దిష్ట సమయానికి మంజూరు చేయడం కోసం లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు నిబద్ధతతో పనిచేయాలని రుడా వైస్ చైర్మన్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం రుడా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు పూర్తి ప్రొఫెషనల్‌గా బాధ్యత వహిస్తూ విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా పనిచేసేవారి లైసెన్స్‌లు రద్దు చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. సమావేశంలో రుడా ప్లానింగ్ ఆఫీసర్ జి.కోటయ్య, ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధిత గ్రామీణ వైద్యులకు బాసట



విజయవాడకు వెళ్లే కిరాణా వస్తువులతో అసోసియేషన్ నాయకులు

ధవళేశ్వరం: విజయవాడ వరదలకు ఇబ్బందులు పడుతున్న తమ తోటి గ్రామీణ వైద్యులకు పీఎంపీ,ఆర్ఎంపీలు బాసటగా నిలిచారు. సుమారు 160 మందికి బాధితులకు ఫెడరేషన్ ఆఫ్ కమ్యూనిటీ పారామెడిక్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పారామెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ది గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సహకారంతో రూ.3.20 లక్షల విలువైన కిరాణా వస్తువులు, రూ.3.20 లక్షల నగదు విరాళంగా అందజేశారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం నుంచి కిరాణా వస్తువులను విజయవాడ తీసుకువెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, జిల్లా అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్, రాజమహేంద్రవరం అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్ ఖాన్, కార్యదర్శి మట్టా రమేష్ పాల్గొన్నారు.

అన్న సమారాధన

కడియం: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపులో భాగంగా శుక్రవారం వీరవరంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు, దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. స్థానిక నాయకులు, యువత సేవలందించారు.

పరిశుభ్రత మన లక్ష్యం కావాలి



మొక్క నాటుతున్న డీపీటీఓ షర్మిల అశోక

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ పరిరక్షణకు మనమంతా కట్టుబడి ఉండాలని జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిల అశోక అన్నారు. స్వచ్ఛతాహీ సేవ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆర్టీసీ డిపో ఆవరణలో మేనేజర్ షేక్ షబ్బుం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ ప్రసూనాంబ, అకౌంట్స్ ఆఫీసర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ఆయాలకు సత్కారం



ఆయాలను సత్కరిస్తున్న కడియం హైస్కూల్ ఉపాధ్యాయులు

కడియం: పాఠశాలలను శుభ్రం చేస్తూ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుతున్న ఆయమ్మల సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ అన్నారు. ప్రపంచ శుభ్రత దినోత్సవం సందర్భంగా కడియం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన, 'అమ్మ అమృత హస్తం' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కడియం ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలను శుక్రవారం ఘనంగా సత్కరించారు. వీరి సేవలను ఎస్ఎంసీ అధ్యక్షురాలు పి.సత్య కొనియాడారు. ఉపాధ్యాయుడు జి.సత్యనారాయణ తదితరులు మాస్కులు, గ్లౌజ్‌లు, పండ్లు, బహుమతులు అందజేశారు.

మాయమాటలేనా..

- హామీలు నెరవేర్చని కూటమి ఎమ్మెల్యేలు
- అధికారంలోకి వంద రోజులు
- ఎక్కడి సమస్యలు అక్కడే..

సీటీఆర్ఐ/రాజమహేంద్రవరం సిటీ: చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయ్యింది. ఈ సందర్భంగా కూటమి నాయకులు సంబరాలు చేసుకుంటున్నారు. ఇంటింటికీ వెళ్లి తమ ప్రభుత్వం గొప్పగా చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే సూపర్ సిక్స్ హామీల ఊసే ఎత్తడం లేదు. ఇక నియోజకవర్గాల స్థాయిలో ఎన్నికల సమయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు చేసిన వాగ్దానాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. అప్పట్లో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామంటూ ప్రజలకు హామీలు ఇచ్చుకుంటూ వెళ్లారు. తీరా అధికారంలోకి వచ్చాక సమస్యలను పట్టించుకోవడం మానేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు (ప్రస్తుత ఎమ్మెల్యేలు) ఇచ్చిన హామీలను ఒక్కసారి గుర్తుతెచ్చుకుందాం.

రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో..

సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చారు. వాటిపై విస్తృతంగా ప్రచారం చేశారు. కానీ అధికారంలోకి వంద రోజులైనా వాటిని నెరవేర్చలేదు. వాటిలో కొన్ని..

- **తాగునీటి అవస్థలు**

గోదావరి పక్కనే ఉన్నప్పటికీ నగరంలో రెండు పూటలా తాగునీరు అందించలేని పరిస్థితి. ప్రస్తుతం రోజుకు 65 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నారు. 2024 ప్రణాళికా ప్రకారం నగరంలో 120 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాల్సి ఉంది. ఆ మేరకు నిధులు వెచ్చించి తాగునీటి సరఫరాను మెరుగు పర్చుతానని ఎన్నికల సమయంలో ఆదిరెడ్డి శ్రీనివాసు హామీ ఇచ్చారు. కానీ నేడు ఒక్క పూటైన పూర్తిగా మంచినీరు అందిస్తే చాలని నగరవాసులు కోరుకుంటున్నారు.

- **గాలిలోనే హామీలు**

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామని, ఎస్సీలకు 27 పథకాలను పునరుద్ధరిస్తామని, ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ రుణాలు అందజేస్తామని, మైనార్టీలను ఆదుకుంటామని ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఇమామ్‌లకు నెలకు రూ.10 వేలు, మౌజాన్‌లకు రూ.5 వేలు గౌరవ వేతనం అందిస్తామన్నారు. వాటిలో ఏ ఒక్క హామీ నెరవేరలేదు.

- **మహిళలకు వడ్డీ లేని రుణాలు**

నగరంలో స్వయం సహాయ సంఘాలకు ఎటువంటి వడ్డీ లేకుండా రూ.10 లక్షలు వరకూ రుణాలు అందిస్తామని వాసు హామీ ఇచ్చారు. దీనివల్ల లక్ష మందికి పైగా మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు. వడ్డీ లేని రుణాలు సంగతి సరే, అసలు మహిళలకు రుణాలు ఇవ్వటానికి చర్యలు చేపట్టలేదు.

- **సర్వేలెన్స్ టీమ్ ఏమయ్యాయి**

మహిళలకు నగరంలో రక్షణ లేకుండా పోతోందని, వారికి భద్రత కల్పించేందుకు కూటమి అధికారంలోకి రాగానే సర్వేలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేస్తామని వాసు వెల్లడించారు. కానీ వాటి సంగతి ఏమైందో తెలియడం లేదు.

- **స్టేడియం హామీ ఏమైందో..**



మున్సిపల్ స్టేడియం

కూటమి అధికారంలోకి రాగానే మల్టీపర్పస్ స్టేడియం నిర్మాణం జరుగుతుందని అప్పట్లో హామీ ఇచ్చారు. నగరంలో మల్టీపర్పస్ క్రీడా మైదానాల కోసం టీడీపీ హయాంలో రూ.23 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు తీసుకొచ్చామన్నారు. కానీ వాటి ప్రగతి ఏమిటో ఎవ్వరికీ తెలియదు.

- **గోదా'వర్రీ'**

అఖండ గోదావరి తీరానికి ఆధ్యాత్మిక శోభను తీసుకుని వస్తామని, పర్యాటక రాజధానిగా మారుస్తామని వాసు తెలిపారు. కానీ నేడు గోదావరి పరిసరాలు చెత్తాచెదారాలతో నిండిపోయాయి. స్నానాలు చేయడానికి కూడా వీలులేని పరిస్థితి ఏర్పడింది.



కంబాల చెరువు పార్కులో ఎంట్రీ ఫీజు బోర్డు

- **ఎంట్రీ ఫీజు రద్దు సంగతి మరచిపోయారా..**

ఆహ్లాదం కోసం ప్రజలు పార్కులకు వస్తారని, అటువంటి వాటికి ప్రవేశ రుసుం (ఎంట్రీ ఫీజు) వసూలు చేయడమేటని అప్పట్లో ఆదిరెడ్డి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వస్తే కంబాల చెరువు పార్కుకు ఎంట్రీ ఫీజును రద్దు చేస్తామని ప్రకటించారు. ఆయన అధికారంలోకి వచ్చారు. కానీ ఎంట్రీ ఫీజును రద్దు చేయించడం మర్చిపోయారు.



బర్మాకాలనీలో రోడ్డు మీద పేరుకు పోయిన చెత్త



వీటీ డిగ్రీ కళాశాల వద్ద డ్రైనేజీ పరిస్థితి

- **అపరిశుభ్రత**

నగరాన్ని అభివృద్ధి, పరిశుభ్రంగా ఉండేలా చేస్తానని ఆదిరెడ్డి వాసు ఇచ్చిన హామీ చెత్తలో కూరుకుపోయింది. ఎక్కడ చూసినా చెత్త, చెదారాలతో నగరం డంపింగ్ యార్డ్‌గా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో చెత్తని వేయడానికి ఏర్పాటు చేసిన డబ్బాలను కూటమి ప్రభుత్వం తొలగించింది. దీంతో ప్రజలు చెత్తని తీసుకువచ్చి రోడ్డుపై వేస్తున్నారు.

రూరల్ నియోజకవర్గంలో..

రాజమహేంద్రవరం రూరల్: 'వైకాపా పాలనలో అస్తవ్యస్త విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాటి నుంచి అన్ని వర్గాలకు విముక్తి కల్పించేలా కూటమి మ్యానిఫెస్టోను ప్రకటించాం. యువతకు ఉపాధి, మహిళలకు ఆర్థిక స్వాలంబన కూటమితోనే సాధ్యం' అని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఎన్నికల సమయంలో ఈనాడు పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్వయంగా తెలిపారు. మ్యానిఫెస్టోను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలు మన్ననలు అందుకుంటామన్నారు. కానీ కూటమి అధికారంలోకి వంద రోజులైనా ఆయన ఇచ్చిన హామీలు నెరవేరలేదు. అలాగే 2014, 2019 లోనూ గోరంట్లే ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నారు.

- **ముంపు సమస్యకు మోక్షమెప్పుడు!**



వర్షం కురిస్తే రైల్వేస్టేషన్ రోడ్డు పరిస్థితి

భారీ వర్షాలు కురిస్తే రైల్వేస్టేషన్, శ్యామలా సెంటర్ తదితర ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నారు. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరిస్తామని 2014 నుంచి బుచ్చయ్య చౌదరి చెబుతూనే ఉన్నారు.

- **గ్రామాల విలీనం సమస్య**

రాజమహేంద్రవరం నగరపాలకసంస్థలో పరిసర 21 గ్రామాలను విలీనం చేస్తూ 2012లో రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో అప్పటి మాజీ ప్రజాప్రతినిధులు కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి పంచాయతీలకు ఎన్నికలు జరగడం లేదు. దీంతో ప్రత్యేకాధికారులు పాలనలో కొనసాగుతున్నాయి. ఈ 21 గ్రామాల్లో రూరల్ నియోజకవర్గానికి చెందిన రూరల్ మండలం కోలమూరు మినహాయించి తొమ్మిది గ్రామ పంచాయతీలు, కడియం మండలంలో ఒక పంచాయతీ నగరపాలకసంస్థలో విలీనమయినప్పటికీ పూర్తిస్థాయిలో ఆచరణలోకి రాలేదు. రెండు, మూడుసార్లు పది గ్రామ పంచాయతీల నుంచి రికార్డులు స్వాధీనం చేసుకున్నా, మరలా వెనక్కు ఇచ్చేయడం జరుగుతుంది. ఎన్నికల ప్రతి సమయంలో గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఈ విలీనం సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం తప్ప, ఆచరణలోకి తీసుకురావడం లేదు.

- **తాగునీటి ఇబ్బందులు**

రూరల్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి గోదావరి శుద్ధి జలాలను అందిస్తానని ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి హామీ ఇచ్చారు. బొమ్మూరులోని 220 ఎంఎల్‌డీ ప్లాంట్ ద్వారా కడియం మండలం, రూరల్ మండలంలో పలు గ్రామాలకు మాత్రమే గోదావరి నీరు ట్యాంకులకు మాత్రమే చేరుతుంది. గోదావరి చెంతనే ఉన్న కాతేరు గ్రామానికి అందడం లేదు. వేసవిలో కాతేరులో మంచినీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య కూడా ఇంత వరకూ పరిష్కారం కాలేదు.


అవ్వా తాతలు సంతోషించేలా..
రూ.4 వేల పింఛను ఇస్తాం
సూపర్ 6

2025 మే 5వ తేదీన ఈనాడు పత్రికలో వచ్చిన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఇంటర్వ్యూ

- **టూరిజం హబ్ మాటేమిటి..**

నర్సరీలు అధికంగా ఉండే కడియం ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతానని గోరంట్ల హామీ ఇచ్చారు. టూరిజం హబ్‌గా మారితే మార్కెటింగ్ సదుపాయం పెరగడంతో పాటు ఇక్కడ ఉపాధి పొందుతున్న సుమారు 50 వేల మంది వలస కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. కానీ ఇప్పటి వరకూ నర్సరీ రైతులతో సమావేశాలు, జిల్లా అధికారులు పరిశీలన తప్ప పూర్తిస్థాయిలో ఇంకా అమలుకు నోచుకోలేదు. వీటితో పాటు టిడ్కో ఇళ్లల్లో ప్రజలు నివాసం ఉండేలా చర్యలు, వాంబే గృహాలలో మౌలిక సదుపాయలు కల్పిస్తామన్నారు. నిత్యావసరాల ధరలు అందుబాటులో తెస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.



కడియం నర్సరీలు

సీతారాం ఏచూరి ఆశయం అజరామరం



సంస్మరణ సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్

ఆల్కాట్‌తోట: సీతారాం ఏచూరి ఆశయం అజరామరం అని, ఆయన ఆశయ సాధనకు పునరంకితం అవ్వడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అధ్యక్షతన రాజమహేంద్రవరంలోని అల్యూమినియం అసోసియేషన్ హాల్లో శుక్రవారం సాయంత్రం సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ కమ్యూనిస్టుల జీవన విధానం, సైద్ధాంతిక ఆచరణ, ప్రజల కోసం జీవించే తీరును ఈ సందర్భంగా కొనియాడారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నుంచి సీతారాం ఏచూరితో అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించే మహోన్నత వ్యక్తి అని అన్నారు. వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ ఏచూరి అనేక ఉద్యమాలను ముందుకు నడిపించాలని గుర్తు చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు టీకే విశ్వేశ్వరరెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు అశోక్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ రాజేష్ కుటుంబానికి ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం రూరల్: ఫొటోగ్రాఫర్ పిల్లి రాజేష్ కుటుంబ సభ్యులకు ఫొటోగ్రాఫర్స్‌అసోసియేషన్ ప్రతినిధులు గురువారం రూ.40 వేల ఆర్థిక సాయం అందించారు. తొర్రేడు టిడ్కో కాలనీలో రాజమండ్రి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరి శ్రీను అధ్యక్షతన ఫొటో గ్రాఫర్ పిల్లి రాజేష్ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా సిరి శ్రీను, గౌరవ సలహాదారులు కోని శ్రీను, రావుఅండ్‌రావు, కేతా శ్రీను మాట్లాడుతూ రాజేష్ లేని లోటు తీర్చలేనిదన్నారు. యూనియన్ గౌరవ సలహాదారుడు రావుఅండ్‌రావు గ్రూప్ నుంచి వీడియోగ్రాఫర్ సభ్యులు, సంకూరి బుజ్జి గ్రూప్ నుంచి యూనియన్ సభ్యులు, గుర్రం నాగబాబు ఫ్రెండ్స్ నుంచి సేకరించిన రూ.40 వేలను పిల్లి రాజేష్ కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారులు ప్రభాకర్, సెక్రటరీ లీలా నాగు, ట్రెజరర్ ఆషా రాం బాబు, కో ఆర్డినేటర్ వానపల్లి బాబీ, సలహాదారులు మయూరి శివ పాల్గొన్నారు.



రాజేష్ కుటుంబ సభ్యులకు రూ.40 వేలు అందజేస్తున్న ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆర్ట్స్ కళాశాలలో పరిచయ సమావేశం



విద్యార్థుల తల్లిదండ్రులతో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో భౌతికశాస్త్రం, ఎలక్ట్రానిక్స్ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల మధ్య పరస్పర పరిచయ సమావేశం జరిగింది. నూతనంగా మొదటి సంవత్సరం భౌతిక శాస్త్రం ప్రాధాన్యత అంశంగా బీఎస్సీలో చేరిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులకు భౌతికశాస్త్రం, అనుబంధ సబ్జెక్టులలో ఉన్నత విద్య, పరిశోధనలలోని ఉన్నత అవకాశాల గురించి అవగాహన కల్పించారు. భౌతిక శాస్త్ర అధిపతి సీహెచ్ కోమల లక్ష్మి, ఎన్‌సీసీ, పీజీ కో ఆర్డినేటర్ డాక్టర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

22న ఎమ్మెల్యే ఆదిరెడ్డికి సన్మానం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వెలమ సంఘీయుల ఆధ్వర్యాన ఆదివారం ఉదయం 10 గంటల నుంచి జేఎస్ రోడ్డులోని చెరుకూరి కల్యాణ మండపంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)ను సన్మానించనున్నారు. స్థానిక స్టేడియం రోడ్డులోని అల్యూమినియం అసోసియేషన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెలమ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు అల్లు బాబీ, అధ్యక్షుడు కిలపర్తి శ్రీనివాసు, వెలమ యువత సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొల్లి దుర్గాప్రసాద్, వెలమ ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎనిమిరెడ్డి సత్యనారాయణ తదితరులు ఈ విషయం తెలిపారు. ఈ కార్యక్రమానికి వెలమ సంఘీయులు పెద్ద ఎత్తున విచ్చేయాలని కోరారు. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి సంఘీయులను ఆహ్వానించామన్నారు.

పింఛన్ల పంపిణీకి ఇబ్బంది పడుతున్నాం



ఎంపీడీవో రత్నకుమారికి వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

కడియం: పెన్షన్ల పంపిణీలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కడియం మండలంలోని సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవో కె.రత్నకుమారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఉదయం 8 గంటలకే వందశాతం పెన్షన్లు పూర్తవ్వాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడంతో ప్రమాదాల అంచున పనిచేయాల్సి వస్తోందన్నారు. తెల్లవారుజామున లక్షల రూపాయల నగదుతో ప్రయాణించాల్సి ఉండడంతో దొంగల భయం వెన్నాడుతోందన్నారు. మహిళా ఉద్యోగులు తెల్లవారు జామున విధులకు హాజరు కావాల్సి ఉండడంతో ఇబ్బంది పడుతున్నారనన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నామన్న భావన లేకుండా తమకు అన్ని విధాలా ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమో గుర్తించాలన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి పెన్షన్లు పంపిణీ చేయడానికి తాము కృషి చేస్తామని, వంద శాతం పెన్షన్లు అందిస్తామని వినతిపత్రంలో పేర్కొన్నారు. తమను ఇంటింటికీ స్టిక్కర్లు అంటించి, యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించడం తగదన్నారు.

కోలమూరులో కామెడీ కింగ్స్ స్టూడియో

రాజమహేంద్రవరం రూరల్: టిక్‌టాక్ స్టార్ మద్దు సూరిబాబు, ఆయన తనయుడు మద్దు సతీష్ నిర్మించిన సూర్య ప్రొడక్షన్స్ కామెడీ కింగ్స్ స్టూడియో సీరియళ్లు, షార్ట్ ఫిలిమ్స్ తీసుకునేందుకు బాగా ఉపయోగపడుతుందని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. కోలమూరులో టిక్‌టాక్ స్టార్ సూరిబాబు ఏర్పాటు చేసిన సూర్య ప్రొడక్షన్స్ కామెడీ కింగ్స్ స్టూడియోను ఆయన, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి సినీ పరిశ్రమను ప్రస్తుతం రాజమహేంద్రవరం, వైజాగ్ ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ప్రతిభ ఉన్నప్పటికీ ప్రోత్సాహం లేక కళాకారులు మరుగున పడిపోతున్నారన్నారు. కార్యక్రమంలో కర్రి వీర వెంకటరెడ్డి (గోల్డ్ రెడ్డి), అరుణ చౌదరి, దొంగ శ్రీనివాస్, కుమారి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ భరత్ రామ్

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

కంబాలచెరువు: ఏలూరు దయానంద సరస్వతి హాస్టల్‌లో ఫొటోగ్రఫీ నేర్పిస్తానని చెప్పి 16 మంది అమ్మాయిలను లైంగికంగా వేధిస్తున్న వార్డెన్ భర్త శశికుమార్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో ప్రత్యేక ఐఏఎస్ అధికారితో కమిటీ వేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నవారికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం తీరు దురదృష్టకరమన్నారు. అడ్డతీగల సహాయ గిరిజన సంక్షేమాధికారి వైఖరి ఏకంగా గిరిజన సంక్షేమ విద్యా వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తే పరిస్థితి తెచ్చుకుందన్నారు. బాధిత విద్యార్థి నుంచి అందిన ఫిర్యాదునే కేసుగా పోలీసులు నమోదు చేయాలన్నారు.

అక్కినేని జీవితం అందరికీ ఆదర్శం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్వయం కృషితో మహానటుడిగా ఎదిగిన అక్కినేని నాగేశ్వర రావు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ సూచించారు. అక్కినేని అభిమాన సంఘం ఆధ్వర్యాన అడబాల మరిడయ్య తదితరుల సారథ్యంలో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాన్ని శుక్రవారం సాయంత్రం స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని జిత్ మోహన్ మిత్ర కళావేదికపై నిర్వహించారు. శ్రీపాద జిత్ మోహన్ మిత్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముద్రగడ ఏసుబాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా విశాఖకు చెందిన రచయిత, గాయకుడు, నటుడు రవీంద్రనాథ్ గిరిని అక్కినేని అవార్డుతో సత్కరించారు. పీవీఎస్ కృష్ణారావు, నిమ్మలపూడి గోవింద్, వి.జగపతి, అడబాల మరిడయ్య, బి.సీతారామారావు పాల్గొన్నారు.



రవీంద్రనాథ్ గిరికి అక్కినేని అవార్డు అందజేస్తున్న ప్రముఖులు

ప్రసాద్‌కు రామకృష్ణ అవార్డు

అంతకుముందు జిత్ మోహన్ మిత్ర మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా సినీ గాయకుడు రామకృష్ణ అవార్డుతో సీనియర్ సింగర్ డీవీ ప్రసాద్‌ను జిత్ మోహన్ మిత్ర, పీవీఎస్ కృష్ణారావు సత్కరించారు. గుంటూరు శ్రీనివాస రావు, వంక బాలకృష్ణ, మహేష్, సూర్య సిద్ధాంతి, ఏబీ కృష్ణశర్మ పాల్గొన్నారు.

23.14 కిలోల గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: కారులో గంజాయి తరలిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి 23.14 కిలోల గంజాయిని బొమ్మూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే. దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద శుక్రవారం సాయంత్రం బొమ్మూరు ఎస్సై ప్రియా కుమార్, సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వస్తున్న కారును తనిఖీ చేయగా 23.14 కిలోల గంజాయి దొరికింది. ఆ కారులో ఉన్న పిడింగొయ్యి వెంకటగిరి ప్రాంతానికి చెందిన రెడ్డి నాయుడు, ఊలపల్లి మణికంఠ, ఊలపల్లి జనార్దన్, రాజమహేంద్రవరానికి చెందిన మాదా సాయి, హర్షిత్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయితో పాటు కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ గంజాయి విలువ రూ.1.15 లక్షల వరకు ఉంటుందని అంచనా. అరెస్టు చేసిన ఐదుగురిపైన రౌడీషీట్లు ఉన్నాయి.